# మైరావణ రక్తబిందువులు

నేను 1948లో మావూరు వెళ్ళినప్పుడు కూడా మా మునసబు, "మన ఊళ్లో కమ్యూనిస్టు లెవరున్నారులే? ఆ అయిదారుగురే!" అన్నాడు.

ఆ అయిదారుగుర్నీ అందరమూ ఎరుగుదుము. అందులో ఒకరిద్దరు - ఆచార్లుగారబ్బాయీ, కుమ్మరివాళ్ళ కుర్రాడు - ఏనాడో చెడిపోయిన బాపతు. వాళ్లు యించుమించు నాయీడు వాళ్ళే. చదువు సంధ్యలు మానేసి కారల్ మార్క్స్[1] చదువులో పడటమేకాకుండా క్షణానికోసారి "దోపిడీ విధానం", "బూర్జువా మనస్తత్వం", "విప్లవం" అంటూంటే మాకు కొందరికి ఒళ్లు మండిపోయేది. నాలాగే కాలేజి చదువు చదివేవాళ్ళు ఇంకా ఇద్దరు ముగ్గురు వుండేవారు మా వూళ్ళో. మేమీ 'కామ్రేడ్లను" చూసి నవ్వుకునే వాళ్ళం. మరీ శాస్తుర్లుగారబ్బాయి వాళ్ళని చాలా షోగ్గా అనుకరించేవాడు. అసలే వాడు కవి. "మన కామ్రేడ్ భాయీలకి పంటకాలవ తూముల్లో విప్లవ బీజాలు కనిపిస్తాయి. పొలానికి ఎరువు తోలితే ఎక్స్‌ప్లోయిటేష నంటారు. ఎట్లారా వీళ్ళతో?" అనేవాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే మా కమ్యూనిస్టుల ధోరణీ, ఆలోచనా విధానముకూడా అవాస్తవికంగానూ, వ్యక్తిత్వ రహితంగానూ, మూఢవిశ్వాస జనితంగానూ ఉన్నట్టు కనబడేది. వాళ్ళేమో పుస్తకాలు చదివారు. అందులో విషయాలు నమ్మారు. ఆ పుస్తకాలు చదివినవారికి జీవితం ఎట్లా కనిపిస్తున్నదీ మరచిపోయి తమ పరిభాష అర్థమైన వారికి తప్ప మరెవరికీ తమ సంభాషణ అర్థం కాకుండా మాట్లాడటం నేర్చారు. ఊరంతకీ దూరమయేవారు. చిత్రమేమిటంటే ఆచార్లు మాట్లాడినా రాఘవులు మాట్లాడినా ఒకటిగానే వుండేవి. వాళ్ళ అభిప్రాయాలు రైలుపట్టాలులాగా ఎంత దూరంపోయినా కలిసే వుండేవి. అయితే వాళ్లు యెప్పుడూ కలిసి తిరిగేవారు గనకా, చదివిన విషయాలు చర్చించుకునేవారు గనకా మేము ఆశ్చర్యపడే వాళ్ళంకాము. కాకపోతే వాళ్ళ దీక్షమటుకు మాకు ఆశ్చర్యం కలిగించేది. ఎంతమంది వాళ్ళను వెలిగాచూసినా, ఎంతమంది హేళన చేసినా, యెంతమంది శత్రుత్వంతో చూసినా వాళ్లు లక్ష్యపెట్టలేదు. వీళ్ళకి రైతుకూలీలలోగాని కుర్రకారులోగాని ఏమంత పలుకుబడి వున్నట్టు నాకు కనబడలేదు.

కొద్దిరోజులకు యుద్ధం వస్తుందనగా[2] నేను ఉద్యోగంలో కుదిరాను. మా

---

1. కార్ల్‌మార్క్స్ : చూడండి వెనకటి కథలో
2. యుద్ధం : రెండవ ప్రపంచ యుద్ధం (1939-1945)

ఊరికి దూరమైనాను. మా కామ్రేడ్స్ ఆచార్లునూ, రాఘవులునూ మరిచిపోయి నాను. నేను మావూరు వదిలేనాటికి వాళ్ళు అండర్ గ్రౌండ్ అయిపోయినట్టు జ్ఞాపకం.

యుద్ధకాలంలోనే వీళ్ళు మళ్ళీ పైకివచ్చి యథాప్రకారం విప్లవం గురించి మాట్లాడటమేగాక ఈసారి ఫాసిస్టు వ్యతిరేక ప్రజాయుద్ధం[1] గురించి కూడా మాట్లాడి మావూరి హిట్లరు భక్తులకు[2] చాలా ఆగ్రహం తెప్పించారు. ముఖ్యంగా మా శాస్త్రులుగారు, కించిత్తు దైవజ్ఞుడేమో, చక్రాలువేసి హిట్లరు గెలుస్తాడనీ, మన దేశానికి స్వరాజ్యం తెస్తాడనీ, బ్రాహ్మణ్యం నిలబెడతాడనీ కలలు కన్నాడు. తన కొడుకునే వీళ్ళు చేరదీస్తారని ఆయన కలలోకూడా అనుకో లేదు. ఆ మాటకువస్తే నేనూ అనుకోలేదు, వెంకటశాస్త్రి కమ్యూనిస్టుల అనుచ రుడవుతాడని. వాడు కమ్యూనిస్టులమీద వేసిన "జోక్స్" నేను మరువలేదు.

ఒక్క వెంకటశాస్త్రినేకాదు ఊళ్ళో మరికొంతమంది కుర్రాళ్ళకూ, కూలి వాళ్ళకూకూడా ఆచార్లుగారబ్బాయి కమ్యూనిస్టు మతం ఇప్పించారు. ఆచార్లు ఈ పని ఎట్లా సాధించాడో నాకు తెలీదు.

ఊళ్లోమటుకు కమ్యూనిస్టు వ్యతిరేకత రెచ్చిపోయింది. మాది మొదటినుంచీ ప్రబలమైన కాంగ్రెసు గ్రామం. ఆ ఒక కారణమేకాకుండా ఆచార్లు ముఠావాళ్ళు ఊళ్ళో రైతులకు తిండి దొంగలని పేరు పెట్టి ధాన్యం చాటుగా కొన్నవాళ్ళనీ, అమ్మినవాళ్ళనీ నిర్దాక్షిణ్యంగా వేటాడారు. మా రోజుల్లో మేం కమ్యూనిస్టులను చూసి నవ్వి ఊరుకున్నామేగాని ఇప్పుడు — అంటే 1948 నాటికి - ఎంతోమంది ఈ కమ్యూనిస్టుల రక్తం తాగడానికి తహతహలాడసాగారు. ఈ సంగతి కూడా మునసబుగారు నాతో చెప్పాడు. కమ్యూనిస్టులతో చేరిన యువకుల పేర్లుచెప్పి, కాస్త వాళ్ళ బుద్ధి అయినా మళ్ళించమన్నాడు మునసబు. చూస్తానన్నాను. ముందు వెంకట శాస్త్రితో మాట్లాడాను.

"ఏంరా, వాళ్ళనుచూసి నవ్వితివిగదా వాళ్ళతో చేరిపొయ్యావేమిటి?" అన్నాను వెంకటశాస్త్రితో.

---

1. ప్రజాయుద్ధం : 1943. సోవియట్ యూనియన్‌పై హిట్లరు దాడికి పూను కున్నప్పుడు భారత కమ్యూనిస్టులు తీసుకున్న వైఖరి.

2. హిట్లరు భక్తులు : మనదేశంలో ఆర్యరక్తం బ్రాహ్మణత్వం పవిత్రమైందని నమ్ముతూ హిట్లరు అమానుష భావాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమర్థించినవాళ్లు. కుటుంబరావు రాసిన సనాతనిస్టు విభ్రమం అనే కథ చూడండి. అందులోని యాజులు వంటి వారి వాదనలు గమనించండి.

"వీళ్ళ మార్క్సిజంమాట ఏమైనా వీళ్ళుమటుకు మంచి సాహిత్యోద్యమం[1] ప్రారంభించార్రా! దాన్ని కాదనటానికి వీల్లేదు," అన్నాడు శాస్త్రి.

"మా నవ్య సాహిత్యపరిషత్తు[2] లేదూ?" అన్నాను.

'ఉందనుకో, అది అచ్చగా రచయితలకు మాత్రమే సంబంధించిన ఉద్యమం. ఇది ప్రజోద్యమం.'

తిలక్‌నాటి వరకూ రాజకీయ వాదులమధ్య ఉండిన జాతీయోద్యమం గాంధితో ప్రజల మధ్యకి వచ్చినట్టే ప్రతికశోద్యమమూ ప్రజలలోకి రావలసిన అవసరం ఉందని శాస్త్రి వాదించాడు. ఈపని కమ్యూనిస్టులే ఎందుకు చేశారో నాకర్థంకాలేదు.

"వీళ్లు వట్టి కబుర్లురాయుళ్ళు కారు. వీరి సాంఘిక దృష్టిలో కొంత వాస్తవికత ఉందని చెప్పుకోవాలి. నేను ప్రధానంగా కవినే అయినా వీళ్ళు ప్రచురించే కర పత్రాలూ, చిన్నపుస్తకాలూ, వీళ్ళ శాస్త్ర గ్రంథాలూ చదువుతున్నాను. అందులో చాలా యథార్థం ఉంది. నీకు కమ్యూనిస్టులంటే కొంత హేళనగా ఉంటుందని నాకు తెలుసు. వాళ్ళు బోలెడంత సాహిత్యం ప్రచురిస్తున్నారు. అదంతా చదవ కుండా నీవు వాళ్ళను గురించి ఎట్టి అభిప్రాయానికీ రావద్దు" అని శాస్త్రి నాకు హితవు చెప్పారు.

**"A man is what he eats"** అని ఎవరో అన్నారు. **A man is what he reads** అని కూడా అనుకోవచ్చు. తినే పదార్థాల ప్రభావం మనిషిమీద ఉన్నట్టే చదివే పుస్తకాల ప్రభావమూ మనిషిమీద ఉండి తీరుతుంది. శాస్త్రి కమ్యూ నిస్టు పుస్తకాలు చదివి ఈ విధమైన పరిణామానికి గురిఅయినాడని గ్రహించుకుని, వాణ్ణి బాగుచేసే ఆశవదులుకుని ఊరుకున్నాను.

---

1. మంచి సాహిత్యోద్యమం : అభ్యుదయ రచయితల సంఘ ఉద్యమం. ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం మొదటి సభ 1943లో తెనాలిలో జరి గింది. రెండవసభ 1944 చివరలో విజయవాడలో, మూడవసభ డిసెంబరు 31, 1945 జనవరి 2, 1946.
2. నవ్య సాహిత్య పరిషత్తు : 1936 మార్చి 10, 11, 12 తేదీలు బరంపురంలో అభినవాంధ్ర కవిత పండిత సభగా మొదలైన సాహిత్య సంస్థే 1936 నాటికి గుంటూరులో నవ్యసాహిత్య పరిషత్తుగా అవతరించింది. పరిషత్తు స్థాపనకు ముఖ్యకారకులు గురుభాగవతుల ధర్మారావు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి. కాకినాడలో పంచాగ్నుల (1936), గుంటూరులో గిడుగు (1937), బందరులో బుర్రా శేషగిరిరావు (1938), విజయవాడలో విశ్వనాధ (1940), పరిషదధ్యక్షులు. నవ్యసాహిత్య ప్రచారానికి, ఆధునిక భాషా వ్యాప్తికి దోహదం చేసిన సంస్థ. ప్రతిభ పత్రిక సాయం.

ఇంకా ఒక రిద్దరు కమ్యూనిస్టు భక్తులతో మాట్లాడాను. వాళ్ళు శాస్త్రి మాట్లాడినంత ఓపికగానైనా నాతో మాట్లాడలేదు. నా అభిప్రాయాలు విని వాళ్ళు నవ్వారు. నాకేదో ప్రపంచజ్ఞానం లేనట్టూ, ఏ బావి అడుగునుండో అప్పుడే పైకి వచ్చిన కప్ప నైనట్టూ చూశారు. వెనక మేం వీళ్ళను చూసి నవ్వితే, వాళ్ళిప్పుడు మిమ్మల్ని చూసి నవ్వుతున్నారుకదా అనుకున్నాను.

తరవాత గడచిన ఒకటి రెండు సంవత్సరాలలో నా అనుమానాలన్నీ రూఢి అయినాయి. ఒక్కసారిగా కమ్యూనిస్టు పాపంపండి బద్దలయినట్టయింది. ఏ పత్రికలో చూసినా కమ్యూనిస్టు ఘాతుకచర్యలే. హత్యలు, దోపిడీలు! అదివరకు కమ్యూనిస్టులను సమర్థించినవారుకూడా వీళ్ళ చర్యలు చూసి దద్దరిల్లిపోయినారు. కొంతమంది కమ్యూనిస్టులు పార్టీలో నుండి బయటికి వచ్చినట్టు పత్రికల్లో పడింది. ఇదంతా దూరాన ఉండి వినటంలో ఒకవేళ ఉన్నదానికన్న భయంకరంగా కనపడిందేమో.

కమ్యూనిస్టుల ఖండన విషయంలో ఈ విధంగా నేను నిశ్చనమలటాని కొక కారణం ఉంది. పట్నంలో నాకొక జర్నలిస్టు స్నేహితుడున్నాడు. అతనొక దినపత్రిక ఆఫీసులో పని చేస్తున్నాడు. అతననటం అనేకచోట్ల హత్యలు జరుగుచున్నమాట నిజమేగాని అందులో చాలా భాగం కమ్యూనిస్టులకు సంబంధం లేకుండానే కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారంకోసం వినియోగించబడుతున్నదని, మామూలుగా వ్యక్తిగత ద్వేషాలతో చేసిన హత్యలుకూడా కమ్యూనిస్టులు చేసినట్టే వార్తలు వచ్చాయి. కొన్ని అసత్యవార్తలు సృష్టించబడ్డాయి.

అదీకాక పోలీసుల అత్యాచారాలొకటి కమ్యూనిస్టు చర్యలతో పోటీచేయసాగాయి. కాటూరు, ఎలమర్రు ఉదంతాలు దేశమంతటా పొక్కిపోయాయి[1]. బాధ్యతను మొదట్లో పోలీసు అత్యాచారాలుకూడా కమ్యూనిస్టులకే అంటగట్టాం. కాని ఇదికూడా సాధ్యంకాని పరిస్థితి ఏర్పడింది. నేను నాకళ్ళారా ఒక లేఖచూశాను.

1. కాటూరు, ఎలమర్రు ఉదంతాలు : 1949 జూలై 16న కృష్ణా జిల్లాలోని కాటూరు గ్రామాన్ని 300 మంది పోలీసులు చుట్టుముట్టి, 400 మంది స్త్రీ పురుషుల్ని వివస్త్రల్నిచేసి ఊరేగించిన ఒక అమానుష అత్యాచార ఉదంతం. 1940 జూలై 14వ తేదీ ఉదయం 400మంది మలబారు పోలీసులు ఎలమర్రు గ్రామాన్ని చుట్టుముట్టి, కమ్యూనిస్టులయినా కాకపోయినా గ్రామస్థులను లాఠీలతోమోది వివస్త్రల్ని చేసి, చేతులయినా అడ్డం పెట్టుకోనీకుండా లాఠీలతో మోదుతూ ఊరేగించి, గాంధీ విగ్రహం ముందు మోకరిల్లజేసి కాంగ్రెసుకు జై అనిపించిన మరొక రాక్షసోదంతం ఎలమర్రు ఉదంతం. (చూ.పి. సుందరయ్య, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం, గుణపాఠాలు)

ఒక గ్రామంలో పెద్దలు తొమ్మిది మంది సంతకాలుచేసి ఆ లేఖ పంపారు. వారితో ఒక కాంగ్రెసు కార్యకర్తకూడా వున్నారు. వారి గ్రామంలో యేదో హత్య జరిగింది. పోలీసులువచ్చి గ్రామాన్నంతా అల్లకల్లోలం చేశారు. ఆ గ్రామంలో కమ్యూనిస్టులు లేరట. అయినా ఈ హత్యను కమ్యూనిస్టులకే అంటగట్టి, గ్రామ పెద్దలు చెబుతున్నా వినక, పోలీసులు ఇళ్ళలోకి దూరి అత్యాచారాలుచేసి లేని కమ్యూనిస్టులను చూపమని స్త్రీలనూ పురుషులనూ హింసించారని ఆ లేఖ ఘోషించింది. ఈ లేఖ చూస్తుంటే నాకు మతకలహాలు జ్ఞాపకం వచ్చాయి. ఎక్కడ ఏ హిందువుడి హత్య జరిగినా ముస్లింలకే అంటగట్టారు. ఏ ముస్లిము హత్య జరిగినా హిందువుడికి అంటగట్టారు. ఇంకా పూర్వం మతకలహాలు జరిగినప్పుడు ముస్లిములు హిందువులను చంపుతున్నంత కాలమూ పోలీసులు పత్తాలేకుండా పోయి హిందువులది పైచేయి కాగానే పోలీసులు వచ్చి శాంతిస్థాపన చెయ్యటం జరిగింది. కాశీలో యిది నేను స్వయంగా చూశాను. కాని, అదంతా భారతీయుల బానిసత్వంలో, ఏ రోజుల్లోకూడా ప్రజాప్రభుత్వం క్రింద దొంగసాకుపెట్టి ప్రజలను పోలీసులు భీతావహులను చేయటం ఎరగం. ఈ భయంకరమైన పని కాంగ్రెసు హయాంలో జరిగింది. దేశంలో మేధావులే లేనట్టూ, తాము డిక్టేటర్లయినట్టూ ప్రవర్తించారు పోలీసు అధికార్లు! నా బోటివాడి ఆత్మాభిమానానికీ న్యాయబుద్ధికీ ఇది సహించరాని విషయమయింది. ఒకరిద్దరు నాలాటి కమ్యూనిస్టు విముఖులు, "కమ్యూనిజం నాశనం కావాలంటే ఇటువంటివి భరించాలి మరి!" అన్నారు. పేలుపడ్డాయని తలకు కొరివి పెట్టుకోవటం బుద్ధిహీనులు చేసేపని. "మీరు బుద్ధిహీనులల్లే మాట్లాడుతున్నారు" అని వాళ్ళతో అనేశాను. వాళ్ళు నన్ను వెంటనే "కమ్యూనిస్టు సహచరుడు" అనేశారు.

ఇది నాకొక కనువిప్పన్నమాట. కమ్యూనిస్టనిపించుకోవటం ఎంతతేలికో నాకు తెలిసిపోయింది. ఒకప్పుడు ఆచార్లు నాతో అన్నాడు కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం దొరకటం చాలా కష్టమని. "డబ్బిస్తే మహాచక్కగానే దొరుకుతుందిలే!" అని నేను అనేశానుకూడా! కాని ఇవాళ బానిస మనస్తత్వం లేనివాళ్ళూ, అన్యాయం సహించనివాళ్ళూ కమ్యూనిస్టుల కింద జమచేయబడుతున్నారు. పోలీసులూ, కాంగ్రెసు ప్రభుత్వబలమూ కేవలం బుద్ధిహీనుల పక్షాన ఉపయోగించబడుతున్నది. దేశం భవిష్యత్తును గురించి నాకు ఏదో భయంపట్టుకుంది.

ఇంతలో మావూరినుంచి వార్తవచ్చింది. ఆచార్లునూ, వెంకటశాస్త్రినీ, మరి ఇద్దర్నీ పోలీసులు కాల్చేశారని! ఈ వార్త విన్న మరుక్షణం నాలో ఏదో మంట బయలుదేరింది. ఆ హత్యలకు నేనే బాధ్యుణ్ణయినట్టు బాధపడ్డాను. ఆచార్లుగాని, వెంకటశాస్త్రిగాని హత్యాకాండలో పాల్గొన్నట్టు నేనూహించలేక పోయినాను. ఆచార్లు భావాలూ, మాటల ధోరణీ నాకు రుచించలేదు. అంతమాత్రంచేత అతన్ని చంపాలా?

మనకు నచ్చని భావాలున్న వారందర్నీ మనం చంపటం మొదలు పెడితే ఏమవుతుంది?

మావూరువెళ్ళి ఏం జరిగిందీ తెలుసుకుంటేనేగాని నాకు మనస్సు నిలవలేదు. వెళ్ళాను. తెలుసుకున్నాను. ఏం చెప్పాలి? ఇటువంటి సంఘటనలే సిద్ధార్థుడి[1]వంటి వాళ్ళను సన్యాసులుగా చేసేది; ఇటువంటి సంఘటనలే పచ్చి కట్టెలను భగభగా మండించేది.

వెంకటశాస్త్రి అజ్ఞాతవాసం చెయ్యలేదుగాని ఆచార్లు మొదలైన వాళ్ళకు అప్పుడప్పుడూ ఆశ్రయ మివ్వటమూ, వార్తలందించటమూ మొదలైన పనులు చేసినట్టు తోస్తుంది. అతన్ని పోలీసులు పట్టుకున్నారు. కమ్యూనిస్టుల జాడలు తెలపమన్నారు. వెంకటశాస్త్రి తనకేమి తెలియదన్నాడు. అయితే వెళ్ళిపొమ్మన్నారు. వెనక్కు తిరగగానే కాల్చేశారు.

ఆచార్లును అజ్ఞాతంలో వుండగా పట్టుకున్నారు. అతనిజాడ చెప్పిన వాళ్ళెవరో తెలీదు, కాని యెవరో చెప్పినమీదటే పట్టుకున్నారు. పోలీసులకు చిక్కిన ఆచార్లును మా ఊళ్ళో పెద్దలు డబ్బిచ్చి కొనుక్కున్నారని విన్నాను. అయిదు వంద లిచ్చారని పుకారు. ఈవిధంగా ఆచార్లును కొన్న పెద్దలు అతన్ని చిత్ర హింసచేసి చంపేశారు. ఈ దారుణ హత్యను ఎంతమంది పంచుకున్నారో తెలియదు. కాని అందరూ ఊళ్ళో పెద్దలల్లేనే తిరుగుతున్నారు. వారిని విచారణకు తీసుకురావడానికి కూడా న్యాయయంత్రం లేకపోవడం నాకు చెప్పరాని బాధకలిగిస్తోంది. నేను మావూరు పోలేను, గాంధీటోపీకేసి చూడలేను. పోలీసువాడు కనిపిస్తే పైత్య వికారం చెందకుండా వుండలేను. "ఈదేశం ఎక్కడకు పోతుంది?" అని ఒక్క మనిషి— అందులోను నాబోటి అనామకుడు— ప్రశ్నించుకుంటే ఎబ్బెట్టుగా తోచవచ్చు. కాని యీ ప్రశ్నే సరిగా నన్ను బాధిస్తోంది.

ఒక్కటే తృప్తి. ఇటువంటి పరిణామం ప్రకృతి విరుద్ధం. మానవ ప్రకృతికీ విరుద్ధమే. అందుచేత ప్రకృతీ, మానవ ప్రకృతీకూడా వీటిమీద పగతీర్చుకుంటాయి అని నాలో దృఢ విశ్వాసం.

మాగ్రామంలో నలుగురి రక్తం ప్రవహించింది. అది మామూలు రక్తం కాదు. మైరావణుడి రక్తం అయివుండాలి. లేకపోతే ఏడాది తిరక్కముందే ఎన్నికలు[2] జరిగే సరికి కమ్యూనిస్టు అభ్యర్థికి మావూరి నుంచి వెయ్యివోట్లు ఎట్లా వచ్చాయి? ఆచార్లు మెడమీద కాడివేసి తొక్కినవాళ్ళు ఈ నిర్ణయాన్ని గురించి ఏమంటారు? కాంగ్రెసుకు వేసే ఓట్లు తిండిదొంగలకూ, నరహంతకులకూ పోతాయేమోననే

---

1. సిద్ధార్థుడు : గౌతమ బుద్ధుడు (క్రీ. పూ. 500)

2. ఎన్నికలు : 1952 ఎన్నికలు.

భయం ఎందుకు కలిగింది? మావూరి నిరక్షకులు ఏం మార్క్సు సాహిత్యం చదివారు? ఆమాటకువస్తే నేనేం చదివాను.

తనలోనుంచేగదా మంటవచ్చిందని కట్టె సంతోషించగానే సరికాదు. ఆ మంట కట్టెనే నుసిచేస్తుంది. సంఘ ద్రోహులు పోతారు. సంఘం ఉంటుంది. చావు లేని ప్రాణినుండి కారే రక్తం వృధాపోదు.

—ముద్రణ, నగారా, 15 జూలై 1953.